క్లుప్తంగా

అడ్మిషన్ల పేరుతో ఫీజుల దోపిడీ

కంబాలచెరువు: అడ్మిషన్ల పేరుతో కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహంకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ గుర్తింపు లేని పాఠశాలలను వెంటనే రద్దు చేయాలన్నారు. జిల్లా కోశాధికారి కె.భాను ప్రసాద్, దినేష్ బాబు, ధర్మేష్ కుమార్, ఐ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కడియం: మండలంలోని దామిరెడ్డిపల్లిలో మన సేవాసమితి ఆధ్వర్యంలో బాటసారులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సహకారంతో ఐదు రోజులుగా ఈ పంపిణీ కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముద్రగడ జెమి, రంపం గోపాలకృష్ణ, ధర్మాసనం శివ, షేక్ సిద్ద, రాజరాజేశ్వరి నర్సరీ యాజమాన్యం, సేవా సమితి సభ్యులు మజ్జిగ పంపిణీకి నిధులు సమకూర్చారన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



ప్రదర్శనను తిలకిస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ: వసుధ ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శన, విక్రయాలు నగర మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని నిర్వాహకులు ప్రవీణ్ కుమార్, సీతాకాంత్ మంగళవారం తెలిపారు. జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాతి గాంచిన సుమారు 50కు పైగా డిజైనర్లు రూపొందించిన వస్త్రాలను ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కతా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నుంచి లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలను పరిచయం చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన 18వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.

ఎన్ని సమస్యలు పరిష్కరించారు

ప్రకాశం నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్నకు చెబుదాం అనే కార్యకమంలో ఎన్ని సమస్యలు పరిష్కరించారో చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి వివిధ రంగాల ప్రజలు సుమారు 270 మంది వరకూ కాల్ చేశారని, చాలామందికి లైన్ కలవడం లేదని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండల రావు తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ప్రభాత్ సాయి సత్తా

ప్రకాశం నగర్: విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్లేఫీట్ టీమ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన టేబుల్ టెన్నిస్ ప్రీమియర్ లీగ్‌లో నగరానికి చెందిన ప్రభాత్ సాయి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు కోచ్ వేణుగోపాల్ మంగళవారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. ఈ లీగ్‌లో ఆరు జట్లు తలపడ్డగా ఎస్ఎంఎస్ డెంటల్ గ్రూప్ విజయం సాధించిందని, ఈ జట్టులో ప్రతిభ కనబరిచిన ప్రభాత్ సాయిని కోచ్‌లు వీటీ సుబ్బారావు, అప్పిరెడ్డి, భీమ్ అభినందించినట్లు చెప్పారు.

కడియంలో బీజేపీ చార్జిషీట్

కడియం: మండల కేంద్రమైన కడియంలో మంగళవారం బీజేపీ చార్జ్‌షీట్ కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ రూరల్ కన్వీనర్ ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చార్జ్‌షీట్ కార్యక్రమం ద్వారా వైఎస్సార్ సీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలను ప్రజల ముందుకు తీసుకువస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో చార్జ్‌షీట్‌ను అందజేశారు. బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, యానాపు ఏసు, నాగులపల్లి వీరబాబు, పన్నాల లక్ష్మీసంతోషి పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు ఖైదీ మృతి

కంబాలచెరువు: రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఖైదీ మంగళవారం మృతి చెందాడు. గుంటూరు జిల్లా కొతుకూరు గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీనివాసు (63) హత్య కేసులో 1985 జులై నెలలో జైలుకి వచ్చాడు. రెండు నెలల తర్వాత 30 రోజుల బెయిల్ మంజూరైంది. తర్వాత 2009లో తిరిగి పోలీసులకు దొరికాడు. ఇదిలావుండగా శిక్ష అనుభవిస్తున్న శ్రీనువాసు మధ్యాహ్నం భోజనం చేసి బ్యారక్‌లోకి వెళ్లిపోయాడు. తర్వాత గుండెల్లో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో జైలు అధికారులు అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో గొడుగులమ్మ జాతర ఇటీవల ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. నర్సాపురం, కొత్త జంబూపట్నం, పశ్చిమగానుగూడెం గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

ప్రయాణం.. ప్రమాదం

- ప్రమాదకరంగా ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ డివైడర్
- సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలంటున్న స్థానికులు



ప్రమాదకరంగా మారిన ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ డివైడర్

ధవళేశ్వరం: జాతీయ రహదారిపై ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ వద్ద ఉన్న మలుపు ప్రమాదాలకు చిరునామాగా మారింది. ఇక్కడ ఇరుపక్కల నుంచీ వాహనాలు ఒకేసారి వస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి తెర మీదకు వచ్చినా అది కార్యరూపం దాల్చలేదు. ధవళేశ్వరంలోని హార్లిక్స్ ఫ్యాక్టరీ, ఇతర ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న వేల మంది కార్మికులు ఈ ప్రాంతం మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు దాటుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరగడం పరిపాటిగా మారింది. ఇండస్ట్రియల్ కాలనీ వాసులు సైతం ధవళేశ్వరం వైపు రావాలంటే ఈ డివైడర్ మీదుగానే రావాల్సి ఉంటుంది. నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించడానికి స్థానికులు బెంబేలెత్తుతున్నారు.

నిత్యం రాకపోకలు

ధవళేశ్వరం వాసులు నిత్యం రాకపోకలు సాగించే ఇండస్ట్రియల్ కాలనీ సెంటర్ డివైడర్ వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. జాతీయ రహదారిపై వేమగిరి నుంచి బొమ్మూరు వెళ్లే వాహనాలు ఒక పక్క, బొమ్మూరు నుంచి వేమగిరి వెళ్లే వాహనాలు మరో పక్క రాకపోకలు సాగిస్తుండటంతో ధవళేశ్వరం వైపు మళ్లించే వాహనాలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని హైవే అథారిటీ అధికారులు బొమ్మూరు సెంటర్‌లో ఏర్పాటు చేసిన విధంగా సిగ్నల్ లైట్లు ర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జితో శాశ్వత పరిష్కారం

ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ద్వారా ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని పలువురు సూచిస్తున్నారు. సుమారు 60 వేల మంది జనాభా కలిగిన ధవళేశ్వరంలో నిత్యం వేలమంది ఈ మార్గం నుంచే ప్రయాణిస్తుంటారు.

పేదరికమే అర్హతగా పథకాల లబ్ధి



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

- ఎంపీ భరత్‌రామ్
- 46వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్ పాలనలో పేదరికమే అర్హతగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మంగళవారం నగరంలోని 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. గడప గడపకూ కార్యక్రమంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను బాగా చదివించాలని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకలు చోడిశెట్టి పల్లంరాజు, మురళీ కృష్ణ, రొక్కం త్రినాథ్, సచివాలయం, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఒనువులమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో ఒనువులమ్మ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో ఒనువులమ్మ తల్లి జాతర వైభవంగా జరిగింది. ఆదివారం ప్రారంభమైన ఈ జాతర మంగళవారం అమ్మవారి నైవేద్యాలతో ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన బంధువులతో తొర్రేడు కిటకిటలాడింది. కార్లు, ద్విచక్ర వాహనాలతో గ్రామ ప్రధాన రహదారి, అంతర్గత దారులు కిక్కిరిసిపోయాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి మీనా నగరం, కాంద్రకోట వారు ఏర్పాటు చేసిన బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మంగళవారం పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు



కడియంలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ఇన్నీసుపేట గ్రంథాలయంలో విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీసుపేటశాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్, లలిత సంగీతం తరగతులు నిర్వహించారు. ఇజ్జిన వినోద్ కుమార్ విద్యార్థులకు చిత్ర లేఖనం నేర్పించారు. ట్రస్ట్ సభ్యులు మతల రమేష్, బొడ్డు శ్రీనివాసరావు, అల్లు సత్య నారాయణ, గేదెల వెంకటేశ్వరరావు, సిరిపురపు రమేష్, పసల శివాజీ పాల్గొన్నారు. ట్రస్టు సభ్యుడు చలుమూరి సత్య నారాయణ విద్యార్థులకు మజ్జిగ వితరణ చేశారు. తమ్మన వెంకట సత్య కుమార్, నాగలక్ష్మి దంపతులు స్నాక్స్ ఏర్పాటు చేశారు.

చిత్రలేఖనం పోటీలు

ప్రకాశం నగర్: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా సీతంపేట గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ రాజ్ కుమార్ చిత్రలేఖనం, క్రాఫ్ట్ బొమ్మల తయారీని నేర్పించారు. వారాంతపు టెస్టుగా చిత్ర లేఖనం పోటీలు జరిపారు. గ్రంథాలయ అధికారి కె.సుగుణ కుమారి మాట్లాడుతూ జూన్ 11 వరకూ నిర్వహించే ఈ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

ప్రకాశం నగర్: దానవాయిపేట మహిళా గ్రంథాలయం, శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు మంగళవారం 9వ రోజుకు చేరుకున్నాయి. విద్యార్థులకు డ్రాయింగ్ టీచర్ ఐ.వినోద్ కుమార్ వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్పించారు. యోగా టీచర్ ఎం.సూర్య నారాయణ ఆసనాలు, సూర్యనమస్కారాలపై శిక్షణ ఇచ్చారు. నీతి కథలు, సుమతి పద్యాలు నేర్పించారు. మహిళా గ్రంథాలయ అధికారి అబ్బిరెడ్డి చంద్రపద్మాదేవి, శాఖా గ్రంథాలయం అధికారి పి.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

కడియం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో 9వ రోజైన మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రంథాలయంలోని పుస్తకాలపై సమీక్ష చేశారు. పేపరుమిల్లు ఉద్యోగి భాస్కరరావు నీతికథలు చదివించారు. రైతు నాయకుడు వెంకటేశ్వర్లు అల్లాఉద్దీన్ కథ, రిషిత లెక్కలు, సురేష్ సోషల్‌పై అవగాహన కల్పించారు.

గ్యాస్ సిలెండర్ల స్వాధీనం

కడియం: గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన గృహావసర గ్యాస్ సిలెండర్లను మంగళవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కడియంలోని అనంతలక్ష్మీ నగర్‌లో ఉండే పేరూరి వీర వెంకటరత్నం తన ఇంట్లో 20 సిలెండర్లను నిల్వ చేశాడు. వీటిని ప్రైవేటు హోటళ్లు, ఫంక్షన్లు, వాణిజ్య అవసరాలకు అదనపు ధరకు అమ్ముతున్నాడు. దీనిపై విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులతో కలిసి దాడి చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ మాట్లాడుతూ గృహావసర సిలిండర్ల వినియోగంలో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎంఎస్‌వో మల్లీశ్వరి, ఇన్‌స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు లోవకుమార్, వీరబాబు, రెవెన్యూ సిబ్బంది ఈలి ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీరు, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలి



ఫ్యాక్టరీలో నీటి సదుపాయాన్ని పరిశీలిస్తున్న వలీ తదితరులు

సీటీఆర్ఐ: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా కార్మికులకు, శ్రామికులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, మజ్జిగను యాజమాన్యాలు అందుబాటులో ఉంచాలని సహాయ కార్మిక కమిషనర్ బీఎస్ఎం వలీ అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువు వద్ద గల స్పిన్నింగ్ మిల్లులో తాగునీటి సదుపాయాలను పరిశీలించి ఆయన పలు సూచనలు చేశారు. దుకాణాలు, సంస్థలు, పరిశ్రమలు, నిర్మాణాలు చేపడుతున్న యాజమానులందరూ ఈ చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ నుంచి రక్షణకోసం కార్మికులకు వీలైనంత వరకూ పని వేళల్లో మార్పు చేయాలన్నారు. వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతే రాజు



మాట్లాడుతున్న మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు

మధురపూడి: జగన్ సారథ్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతే రాజు అని వ్యవసాయ సలహా మండలి కోరుకొండ మండల చైర్మన్ క్రొవ్విడి సర్రాజు అన్నారు. రాబోయే ఖరీఫ్‌లో వ్యవసాయశాఖ అధికారులు, సలహా మండలి నాయకులు సమష్టిగా పనిచేసి, రైతన్నలకు అండగా నిలుద్దామన్నారు. కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఆయన అధ్యక్షతన సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్రాజు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం రైతులకు భరోసాగా ఉందని, ఆర్‌బీకేల ద్వారా మద్దతు ధరలకే పంటను కొనుగోలు చేస్తోందన్నారు. విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులను పరీక్షించేందుకు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి సమావేశానికి వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉండే విద్యుత్, ఇతర శాఖల అధికారులను హాజరయ్యేలా కృషిచేయనున్నట్లు తెలిపారు. దోసకాయలపల్లి తదితర గ్రామాల్లో లైన్‌మెన్లను నియమించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను కోరతామన్నారు. వచ్చే రబీలో మెట్ట ప్రాంతంలో చిరుధాన్యాలు పండించేందుకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయశాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, మండలాధికారి ఏ.గౌరీదేవి, తహసీల్దార్ పాపారావు, పశుసంవర్ధకశాఖ బూరుగుపూడి డాక్టర్ వనిత, సలహామండలి సభ్యులు తనకాల ప్రసాద్, సన్నపు రత్తయ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.

మళ్లీ జగన్ సీఎం కావాలనేది ప్రజాకాంక్ష

- రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్
- గంర్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: మళ్లీ జగన్ ముఖ్యమంత్రి కావాలనేది రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. మండలంలోని గంర్రేడులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలు కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజలు ఎంపీ సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిలకు అడుగడుగున బ్రహ్మరథం పట్టారు. హారతిలిచ్చి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారిద్దరూ ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి నిస్వార్థం, నిజాయతీ గల ఎమ్మెల్యే అని కొనియాడారు. ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా సూర్యనారాయణరెడ్డిని ఆదరణ, మద్దతు తెలియజేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. ఏ గడపకు వెళ్లిన సంక్షేమ పథకాల అమలుపై సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, అద్దంకి ముక్తేశ్వరరావు, కోసూరి వాసు, గుత్తుల వెంకటరమణ, కేతా శ్రీను, వాసంశెట్టి మాధవ పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: పెదపూడిలో ఈ నెల 18న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సమితి కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులచౌదరి మంగళవారం తెలిపారు. 18న ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

డెంగీ నివారణకు సహకరించాలి



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: డెంగీ వ్యాధి నివారణకు వైద్య సిబ్బందితో పాటు ప్రజలు సహకరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గోకవరంలో డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో వైద్య సిబ్బంది మాట్లాడుతూ దోమల నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెచ్ఈ శైలజ, సూపర్‌వైజర్ అశోక్, లక్ష్మీకాంతం, వైద్య సిబ్బంది పవన్, రమణ, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

రంగంపేట: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రంగంపేటలో డెంగీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డి.లావణ్య ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఆడ ఏడీస్ దోమ కుట్టడం వల్ల డెంగీ వ్యాధి వస్తుందని, ఈ దోమ పగటి పూటే మాత్రమే కుడుతుందన్నారు. అందుకే ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డే పాటించాలని చెప్పారు. అనంతరం పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని పలు వీధుల్లో డెంగీ నివారణపై ర్యాలీ నిర్వహించారు.

సీతానగరంలో..

సీతానగరం: ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు సూచించారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ డెంగీ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో డెంగీపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ డెంగీ సోకితే జ్వరంతో పాటు తలనొప్పి తీవ్రంగా ఉంటుందన్నారు. రక్తంలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి, రోగి ప్రాణాలకు ముప్పు ఏర్పడవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.రాధాకృష్ణ, సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.